

# విమర్శకుడు

మల్లిక్

అదొక పెద్ద హాలు. ఆహూతులైన పెద్దలందరూ అక్కడ కుర్చీలలో కూర్చున్నారు. వారిలో చాలామంది నవలా రచయితలూ, కథకులూ, కవులూ, సాహితీవేత్తలూ ఉన్నారు. అక్కడ ఒక ప్రఖ్యాత నవలా రచయితచే రచింపబడిన ఒక నవల గురించి చర్చ జరుగుతూంది. ఆ పుస్తక చర్చలో ప్రముఖ రచయితలు కొందరు పాల్గొన్నారు. చర్చ చాల ఇంటరెస్టింగ్‌గా ఉంది. అందరిదీ ఒక్కటే అభిప్రాయం. ఆ నవల ఒక ప్రయోగాత్మకమైనది. రచయిత కూడా చక్కగా రాశాడా నవలని. సన్నివేశ చిత్రణ బ్రహ్మాండంగా ఉంది. ప్రయోగాత్మకమైన నవలలు మన తెలుగు రచయితలు రచించరు అని ఎవ్వరూ అనకుండా చేసిందీ నవల అన్నారందరూ. మొత్తానికి ఆ నవల గురించి అందరు ఉపన్యాసకులూ మంచి అభిప్రాయాన్నే వెలిబుచ్చుతూ చక్కగా విమర్శిస్తూ ఉపన్యసించారు.

చిట్టచివరి ఉపన్యాసకుడు లేచి నిల్చున్నాడు. అందరికీ వ్యతిరేకంగా అతను ఉపన్యసించాడు. అది చెత్త నవలన్నాడు— ప్రయోగం పేరుతో నవలంతా అసహజంగా రాశాడు రచయిత అన్నాడు. రచయితకు తాను నవలకై తీసుకున్న ఇతివృత్తం గురించిన జ్ఞానం చాలా పరిమితమైనదని అన్నాడు. ఇంకా మాట్లాడితే అలాంటి నవలలు తను నెలకి పది రాయగలనని అన్నాడు.

"అలాగయితే ఇప్పటికి మీరు ఎన్ని నవలలు రాశారు ?" ఎవరో విసుగుపుట్టిన మనిషి జనంలోంచి అరిచాడు.

ఆ వ్యక్తి తన ఉపన్యాసం ఆపి గొంతు వినవచ్చిన దిక్కు తిరిగాడు.

"నేను విమర్శకుడిని... నవలా రచయితను కాను...." అన్నాడు ఎర్రగా చూస్తూ ఆ విమర్శక చక్రవర్తి. ●